



# చీకట్లో కన్నులు కనపడవు

రచన: శ్రీసాయిశ్రీ

"మనసున మల్లెల మాలలూగెనే..." అని భానుమతి పాడిన మల్లేశ్వరి పాట కమ్మగా వీనుల విందుగా వినిపిస్తుంది రేడియోలోనుంచి. చిటపట చినుకులు పడుతున్నాయి బయట. చల్లనిగాలి మెల్లమెల్లగా వీస్తుంటే వళ్లు బిగతీసుకొనిపోతుంది చలికి. చాల బిగువైన వాతావరణం !

కాని రామనాధ్ మనస్సు ఏమో పరి పరి విధాలుగా పోతుంది. అతనికి పాట కమ్మదనంగాని, వర్షంతోకూడిన చల్లని గాలివల్ల చేకూరే ఆనందంగాని తెలేటం లేదు. ఎందుకనో? కారణంవుంది.

సీత అందగత్తే! ఆమె అందానికి ఎదురుచూచి, పెద్దలతో పెద్దగొడవ జరిగిం తర్వాత సీత భార్య అయింది రామనాధ్‌కు. భర్త మనస్సు నొప్పించకుండా "కార్యేషుదాసిసీ..." అన్న శ్లోకానికి ఏవిధంగా తీసిపోకుండా ఎంతో నేర్పుతో మసులుతూంది సీత భార్యగా. సాంసారికంగా అటు యిల్లు దిద్దుకోటంలోగాని, యిటు తనకు ఆనందమివ్వటంలోగాని, ఏవిధమైన లోటులేదు రామనాధ్‌కు మరి?

కాని మనస్సు మారేడు కాయలాంటిది! ఎంతటి ఋష్యశృంగుడినైనా అది సమయంచూచి దెబ్బతీసి శృంగభంగం కావించి తీరుతుంది! ఎన్ని కట్టుదిట్టాల్లో వుంచినా ఏదో ఒకరోజు అది ఆ బంధాలన్నిటి తెంచిపారేసి పారిపోక మానదు.

సీతచెల్లెలు సుధ. ఒక్కమాటలో తేల్చాలంటే చక్కని చుక్క, గులాబి రేఖ. ఇంకో మాటకూడా అనాలంటే బెంగాల్ రసగుల్లా! ఎంతటి నిష్ఠపరుడైనా ఆమె ముగ్ధ స్నిగ్ధ సౌందర్య సౌరభానికి నిర్విణ్ణుడు కాకపోడు. పాదరసంలాంటి ఆమె మందగమనాన్ని చూచి ఆశ్చర్యపోతే, ఇక తేనెపిట్టలాంటి ఆమె చంచల నేత్రాలుచూస్తే తారెత్తి పోవల్సిందే! కందిరీగలాంటి ఆమె నడుం, నాగుపాములాంటి ఆమె జడ, చంద్రబింబంలాంటి ఆమె ముఖారవిందం రామనాధ్ మనస్సులో తుపాన్ లేపిందంటే ఇక సంకోచించాల్సిన పనేముంది?

రేపటితో సుధ సెలవలైపోయి, వాళ్ళింటికి పోతుంది. అదే అన్నిటికన్న ఆందోళనకరమైన విషయం!

* * *

"ఏమండీ !"

ఆ పిలుపుతో వుల్కిపడ్డాడు రామనాధ్.

"ఎన్నోసార్లు పిల్చాను. కాఫీ చల్లారిపోతుందని. కాని అయ్యగారేదో ఆలోచనలో వున్నారని వూరుకున్నా. కాఫీ త్రాగండి ఆరిపోతుంది." అన్నది ప్రేమగా సీత చిరునవ్వు నవ్వుతో.

"ఆ! ఏం లేదు...ఏందో...మన ప్రేమగాధ గురించి ఆలోచిస్తున్నా... అంతే!"

"ఊ! అలాగా ?" అని ఒక చిన్న కొంటెచూపు చూచి, కాఫీ నోటి కందించింది సీత. అతను కాఫీ త్రాగాడు.

"ఏమండీ! రేపుసుధ వూరికిపోతుంది కదా! తెల్లవారి ఎనిమిది గంటల బండికి మరి..."

"సుధ వూరికి...పోతుంది...మరి?" అన్నాడతను నిద్రలోవున్నట్లు.

సీత నవ్వి వూరుకుంది. నవ్వుకు నాలుగు అర్థాలున్నాయి కదా!

"అవును! అన్నట్లు...ఇదో వెళ్ళొస్తా బజారుకు...మర్చేపోయా..." అంటూ లేచాడు రామనాధ్.

"ఎంతమంచివారండీ!" అన్నదిసీత.

"ఏందే అక్కా? బావను తెగ పొగడుతున్నావ్! అయినా మొగాడిని పొగడకూడదే! ఏంబావా నేను చెప్పింది నిజమేగా?" అన్నది అప్పుడే స్నానానంతరం ముస్తాబై ఆ సమయానికి అక్కడికి వచ్చిన సుధ.

"నీ మొగుడుని తిడుదువుగానిలేవే" అన్నది నవ్వుతూ సీత.

రామనాధ్ సుధ ముఖారవిందంలోని సుధను క్రోలుతున్నాడు కళ్ళతో.

* * *

"అయినా యింత ఖరీదుపెట్టి కొల్లెగాల్ సిల్కుచీరె, కంచిపట్టు జాకెట్ ఎందుకండీ దానికి?" అన్నది సీతవాటిని చూచి లోపల సంతోషిస్తూనే!

"అందులో ఏముంది సీతా? మరదలికి ఆమాత్రం పెట్టకపోతే మా మామగా రేమనుకుంటారు? సుధ రాక రాక మనింటికి వస్తే ఈ మాత్రం లేకపోతే ఎలా?" అన్నాడు రామనాథ్ తొణక్కుండా. సీత తన చెల్లెలుమీదగల భర్త ఔదార్యానికి సంతోషించి, "సుధా" అని పిలిచింది.

డిటెక్టివ్ సాహిత్యంలోవున్న సుధ అక్క పిలుపుతో నిజలోకంలో పడింది. "ఏం అక్కా అంటూ లేచేలోపల సీతా రామనాథ్‌లు ఆమెదగ్గరికే వచ్చారు.

"ఈ చీరె నీకు నచ్చిందా?" అన్నది సీత.

"ఓ! ఫస్టుగావుంది. 'ఈ క్రీడా విలాసిని' లోని చంచల ఇదే నెమలిరంగు చీరెను వయ్యారంగా కట్టి పోతుంటే— అక్కా—ఊఁ!—బలే జోరుగావుంది" అన్నది తన చేతిలోని డిటెక్టివ్ నవల చూపిస్తూ, పమిట జారిన సంగతికూడా చూచుకోకుండా.

"నీకే సుధ ఇది!" అన్నది సీత.

"బాగుందా?" అన్నాడు రామనాథ్ సుధ కళ్ళల్లోకి చూస్తూ.

"బావతేవటం బాగులేక పోవటమా? నామనస్సుకు నచ్చిన చీరె జాకెట్ పీస్! అయినా యింత ఖరీదు పెట్టి నాకెందుకూ?" అన్నది అతనివైపుచూస్తూ.

"ఇద్దరు ఇద్దరే! ఏం ఖరీదుంది? మీ బావ, అక్క ఏం పెట్టారంటే వెధవ నాల్గురూపాయల కోరా చీరే చూపిస్తే నవ్వరూ మీ వూళ్ళో? అది సరే...నాకు ఆఫీసుటైం అయింది పోవాలి. శుభ్రంగా ఈ చీరె కట్టుకోసుధ! తెచ్చినరోజే కట్టుకుంటే మంచిది. నేవెళ్తా సీత!"

* * *

అనుకోకుండా స్నేహితునితో సినిమాకుపోయి, రామనాథ్ యింటికి చేరేటప్పటికి పదిదాటింది. ఇల్లు నిశ్శబ్దంగా వుంది. అక్కాచెల్లెలు నిద్రపోతున్నారు. డిమ్‌లైట్ వెలుగుతుంది. కొత్త సిల్కు చీరెకట్టుకొని వెళ్ళిపోతుంది కుర్చీ లో కూర్చున్నసుధ ఏదోపుస్తకం చదువుతూ నిద్రపోయినట్లుంది. సీత మంచి నిద్రలో గుబ్బుపెట్టి నిద్రపోతోంది. కిటికీలోనుంచి వచ్చే చల్లనిగాలి సుధ ముంగురులతో ఆడుకుంటుంది. గులాబిపూల వాసన గుమ్మున నాశికాగ్రమునకు తగులుతుంది. పరిసరాల నిశ్శబ్దత, చీకటి, భార్య గాఢనిద్రలో మునిగి వుండటం, మరదలు నిద్రలో వుండటంవల్ల అతని మనస్సులోని కోర్కెలు వెయ్యితలలెత్తినాయి. తన్ను తాను నిగ్రహించుకునే స్థితిపోయింది. పరిసరాల వత్తిడికి తట్టుకోటానికి రామనాథ్ దేవుడుకాదు కదా!

అతని కాళ్ళు ఆమెదగ్గరికి లాక్కొనిపోయాయి! చేతులు యాంత్రికంగా ఆమెనెత్తుకున్నాయి. అతని కాళ్ళు అవతలి పడకగదిలోకి నడిచిపోయాయి. మన్మధుని బాణాని కెదురు తిరగగల ధీరుడు కలికాలంలో కలికానికి కూడా కానరాడు!

* * *

"లేవండి! సుధ అంతా సర్దుకొని కూర్చుంది. ఇక 45 నిమిషాలు వుంది బండికి" అని సీత మేలుకొల్పు పాడిందాక రామనాథ్ నిద్ర లేవలేదు. అందులో సుధ పేరు వుచ్చరించేటప్పటికి వులికిపడి లేచాడు. ముఖం కడుక్కోటం కాఫీ త్రాగటం ఒక్క నిమిషంలో జరిగిపోయాయి!

సాధ్యమైనంతవరకు సుధకు ముఖం చూపించకుండా తిరిగాడు. ముఖం చెల్లటంలేదు. మనస్సు ఘోషపెడుతుంది భార్య కన్యాయంచేశావని. పెండ్లి కానిపిల్లను చెరిచావు అని అరుస్తుంది పాడుమనస్సు దానికుండే దుర్బుద్ధేఅది. అదే చేయమంటుంది! అదే తరువాత నిందిస్తుంది. సుధ ఏం గొడవచేస్తుందో నన్న భయంవుంది. కాని ఆ సూచనలు ఏం కనుపించక పోయేటప్పటికి అతని మనస్సు యింకా ఆరాటపడ జొచ్చింది. ఎన్నడు తప్పుపని చేయనివారుచేస్తే ఇలా నేవుంటుందేమో!

టాక్సీ రైల్వే స్టేషన్ చేరటం, బండి ప్లాట్‌ఫారం మీదికి రావటం ఒకేసారి జరిగాయి! ఆదరాబాదరా టిక్కెట్‌కొని సుధను రైల్లోకెక్కించారు.

"పొంగానే వుత్తరంరాయి" అన్నది సీత ఇంక రైలు కదులు తుందనగానే.

సరేనక్కా! పోయొస్తాబావా! నీకు చాల శ్రమ యిచ్చాను. హాయిగా నిద్ర పోతున్న బావను లేపకకే, ఈ బండి కాకపోతే ఇంకోదానికిపోతా అన్నా కూడ అక్కతో వినలేదు" అన్నది సుధ సర్దాగా చిలిపికళ్ళు చికిలిస్తూ. ఏమి మాటాడలేక రామనాథ్ ఒక్క నవ్వు నవ్వాడు కష్టంమీద. ఇక కష్టపెట్టడం ఇష్టంలేక రైలు కదిలింది.

"వుత్తరం రాయి సుధా!" అన్నారు భార్యాభర్తలు చేతులూపుతూ.

రైలు ప్లాట్‌ఫారం దాటింది. బరువుగా గాలి పీల్చాడు రామనాథ్. ఇంటికి బయలుదేరారు.

ఇంట్లోకి అడుగుపెడుతూ "ఏమండి అంత ఆలస్యంగా వచ్చారు రాత్రి? నన్ను లేపనైనాలేదు అన్నంపెట్టటానికి" అన్నది సీత.

"అఁ!...స్నేహితునితో సినిమాకెళ్ళా...అతనితోనే హోటల్లో భోంచేశాను. ఇక లేపటం దేనికనుకొని గదిలోపోయి పడుకున్నా."

"ఎంత నంగనాచులండీ! పాపం ఏదైనా నమ్మాలి!" అంటూ ఫక్కున నవ్వింది సీత. సీత నవ్వినప్పుడు సుధ లాగే వుంటుంది. అతను బిత్తరపోయి కొంపతీసి సంగతి తెల్సిపోయిందా?" అనుకున్నాడు. ముఖం పాలిపోయింది.

"ఎందుకా నవ్వు?" అన్నాడు కొంచెం కోపంగా నటిస్తూ. ఆ ప్రశ్నతో సంగతేమిటో తెలుస్తుందని.

"పిచ్చిపిల్ల! అది నిద్రలేవలేదు కాని లేకపోతే మీ పరువు తీసేసివుండేది." అన్నది తాపిగా సీత పొయ్యిలో బొగ్గు లేస్తూ.

రామనాథ్ గుండెలలో రాకెట్లు గిర గిర తిరిగాయి! కాని మొగవాడుగా మరి? దబాయించ పూనుకున్నాడు.

"ఏమిటి నీ వెధవ సరసం! నేనేం చేశానని పరువుతీసెయ్యటానికి?" జంకుతూనే ప్రశ్నించాడు కిటికిలోనుంచి బయటికి చూస్తూ.

"ఇంకా దబాయించకండీ! నాకంతా తెల్సు. మీరు రాగానే మేల్కొలేకపోయినా మీరు ఎత్తుకొనిపోయేటప్పుడు కళ్ళు తెర్చాను.

"ఏమైనా దయ్యం పట్టిందా? నేనెవర్ని ఎత్తుకొని పోయింది?" అన్నాడు విసురుగా. పరువు పోతుందిగా!

ఎవరినన్నా ఎత్తుకొనిపోతే ఎవరూరుకుంటారు? అందులో నేనూరుకుంటానా? పాపం! మీరు ఏ పిక్చర్లో చూచారో ఆ ఎత్తుకొని పోవటాలు అని నే నూరుకున్నా, పోనీలే మోయనీయి అని. లేకపోతే మీచేతిలోనుండి అప్పుడే దూకేసేదాన్ని." అని కిలకిల నవ్వింది సీత.

"ఆఁ" అని నోరు తెర్చాడు రామనాథ్.

ఆఁ! అంతే! మీరు నన్ను మోసుకొని వెళ్ళారు. అబ్బే! మీరు పెళ్ళాన్ని మోసేవారు!" అన్నది కొంటెగా.

రామనాథ్ తల గిరగిర తిరుగుతుంది.

"సుథ వుత్త పిచ్చిపిల్ల! నీవు కట్టుకో అక్కా ఈ చీర ముందు అని పోరుపెట్టి నాచేత ఆ సిల్కు చీర కట్టించింది. దాన్ని తెల్లవారకముందే ఇస్త్రీ చేశాను కాబట్టి సరిపోయింది. లేకపోతే దానిదగ్గర పరువుపోయివుండేది. అయ్యగారు రోజుకురోజు చిన్నవారై పోతున్నారు" అన్నది సీత ఇంకో కప్పు కాఫీ అతని నోటి కందిస్తూ.

"ఇస్సబ్బా!"అని చిన్నగా మూల్గాడు రామనాథ్ కాఫీ త్రాగి.

"నన్ను మోయటంలో చాల అలసిపోయారు!" అన్నది సీత కాఫీ కప్పులు తీసుకొనిపోతూ చిలిపిగా.

రామనాథ్ ఏం మాట్లాడుతాడు?

"సుథ కాదన్నమాట! ఊఁ!" అని మెల్లగా గొణుక్కున్నాడు రామనాథ్.

చీకట్లో కన్నులు కనపడవు! ★


## ఓట్టో లీలా సెంటు

ఎల్లప్పుడును మీరు మనస్సంతోషముగా ఉండవలయునన్న మా సెంటును ఉపయోగించవలయును. మీరు ఎన్నో సెంట్లను చూచియుందురు. ఈ సెంటును మీరు కొంచం చేతిగుడ్డకైనను, షర్టుమీదనైనను పూసిన మీరు అనందించుటయే కాక మీ ప్రక్కనవుండు వారందరు వాసనచూచి ఆనందింతురు. ఒకతూరి తీసి వాడినవారికి దీనిగుణము తెలియును.

డ్రామ్ బాటిల్ 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నం. 1376 — మదరాసు-1.


## బహుమతి

రచన : యస్. జీవరత్నము

హౌరానుండి ఢిల్లీకి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణముచేస్తూ యుంటిమి. రాత్రి సుమారు 8 గంటలు. అదేదో పెద్ద జంక్షన్ స్టేషను. అది వాటరింగ్ స్టేషనని మరియు మీల్స్ టైం అని తెలియగా అలా రిఫ్రెష్‌మెంటులోకిపోయి కొద్దిగా టిఫిన్‌చేసి ఒక మేగ్జెయిన్ తీసుకరావలెనని అలా బుక్‌స్టాల్ వైపు పోవుచుంటిని. ఇంతలో ఒక చోట చాలా జన సమూహముతో నిండియున్నది. అలా వెళ్లిచూడగా ఎవరో పెద్ద రైల్వే అధికారివలే యున్నాడు. ఆయనతో మరి కొందరు రైల్వే ఉద్యోగులున్నారు. ఆయనచేత ఒక వెండిషీల్డు కప్పున్నూ, ఒక పూలహారమున్నవి. విషయమును భోగట్టా చేయగా ఈ దినమున ఏ రైల్వే డ్రైవరైతే బండిని రెగులర్ టైమింగ్స్ ప్రకారముగా నడుపునో వారికి ఇవి బహూకరించెదరనియు ఇలానే ఏడాదికొక పర్యాయము రైల్వేవారు ఇట్లు జరుపుచున్నారనియు, ఈసంవత్సరము ఇచ్చట ప్రోగ్రాము వేసిరనియు చెప్పిరి. అదే సమయములో ఒక ట్రెయిన్ స్టేషనుకు చేరుటయు ఆ అధికారి రైల్వే గైడు రిఫర్‌చేస్తూ ఈ బండి సరియైన టైముకు చేరినదని అత్యుత్సాహముతో పోయి ఆ డ్రైవరుకు తన చేతనున్న కప్పు బహూకరించి ఆ పూలహారమును మెడలో వేయబోయెను. డ్రైవరు ఆశ్చర్యపోయి "సార్! ఈబహుమానము నాకు అర్హత కాదనియు, ఇది క్రిందటి దినము ఇదే సమయమునకు చేరవలసినది ఈదినము చేరినదని చెప్పగా ఆ ఆఫీసరు షాకు తిన్నవానివలె నిర్ఘాంతపోయి అలా డ్రైవరు వైపు కళ్లప్పగించెను.

★

